


# కాకిగోల

ఒక బంధువు సంఘుభీతి లేకుండా సంతానవతి అయిందనే వార్త కార్చిచ్చులాగా వ్యాపించింది. కాకిగోల లాగా బంధువుల యేనోట విన్నా యిదే అరుపు కా కా మని అరుస్తున్నట్టు. కొందరు తిక్కకుదిరింది అని అరిస్తే మరికొందరు, ‘‘ధగధగా చదువు వెలిగిస్తున్నదనీ, పెద్ద వుద్యోగంలోకి పోతుందనీ అన్నారే? అంతా కల్లేనా?’’ అంటే యింకొందరు ‘‘అయింది కిన్నెర పెళ్లి! అమ్మాయిగారికేం గోరోజనం? యేం పొగరు? యెవరితోనూ మాటాడేది గాదు. కళ్లు నెత్తికెక్కాయి. కాకిని పొడిచినట్టు పొడుస్తారిహ, యిప్పుడు బాగా తెలిసి వచ్చి, అందరూ కనబడతారు. యెద్దు పుండు కాక్కి రుచి అని అందరి నోళ్లలో నానుతుంది’’ అలా అంటూ లోలోన సంతోషిస్తూ ‘‘చదువు చట్టుబండలైంది. సంసార సాగరంలో బడి యీతరాక మునక లేస్తున్నది. అబ్బో! కిన్నెర కోర్కెలు కోటలేలుదామంటే, కాళ్లు గడపదాటలేదు. అప్పుడే అయిందీ? మొగుడు రాగానే సరా? యిల్లలకగానే పండగయిందీ? ముందున్నది మొసళ్ల పండగ. యెన్ని యెదుర్కోవాలో వూహలేదేమో! కొడుకుని గన్నానని కోమలి పొంగుతున్నది’’ అని కాకిగోల లాగా అరిచారు.

కొందరు ముక్కుమీద వేలేసుకుని ‘‘గొప్ప ఆచారావంతుల బిడ్డేనే! సాంప్రదాయం గలవారి అమ్మాయేనే! అతగాడే వంచించాడేమో! ప్రేమ అనే గుడ్డితనం వచ్చిందేమో! నెత్తిన బుట్టబోర్లిస్తుంటే మిన్న కుండిపోయిందేమో! యేం బావుకున్నట్టు? నమ్మి గొంతు కోయించుకున్నది. చేతికి పట్టమూ రాలేదు. విద్యా నాశనమైంది. తలెక్కడ దాచుకోవాలో తెలియలేదు. వివాహో విద్య నాశాయ సర్వం నాశాయ శోభనం అని వుక్తి. మొదటిది జరగకుండా గుట్టుగా శోభనం ముగిసి, సర్వం నాశాయ అనేది ఋజువైంది. వూరికే పుడుతాయా వుక్తులు? డబ్బూ లేదు పేరూ పోయింది, మెప్పూ లేదు. దారిద్ర్యమూ వదల్లేదు’’ అని పనస చదివారు.

2

కాకి యీక కిందబడి కనిపించినా, కాకి ప్రమాదానికి గురై చచ్చి కిందబడినా, కాకులు పైన వలయాలు తిరుగుతూ, కాకి గోల చేస్తాయి. జాతి పక్షిని బతికించ లేవు. అది హత్య అయితే, వుండేలు దెబ్బవల్ల చచ్చిపడితే, హత్య అని ప్రూవ్ చేయలేవు, ప్రతిక్రియా చేయలేవు. గోల మాత్రం వినబడుతుంది.

నీలాటి రేవు వద్దా, కొళాయి వదలబడి మంచినీళ్లు పట్టే చోటా కాకిగోల వినిపిస్తున్నది. దవడ మీద చెయ్యి వేసుకుని ఒక కాకి, ''మొగుడెవరో చెప్పదుట. కట్టుదిట్టం జరిగిందేమో! నిర్ధారణ చేయలేక కావు కావు మంటుండగానే, పొగరాజి రెండున్నరేళ్లయిందా, కూతుర్ని గూడా అలాగ్గా కనేసిందట కిన్నెర'' అన్నది.

నడివయస్కురాలు కామేశ్వరి దోరచింతకాయ వుప్పద్ది తింటున్నట్టు లొట్టలేస్తూ కొప్పుతిప్పుతూ అన్నది.

''యెలా నిర్ధారిస్తారు? పంచపాండవులు బోజమ్ ఫ్రెండ్స్. యెవరికి కన్నదో అదే చెప్పాలి. పురాణంలో తార కడుపుతో వుంటే తగాయదా అయితే, బ్రహ్మదేముడెళ్లి తారను బుజ్జగించి, ''చెప్పమ్మా తారా! పుట్టబోయే బిడ్డ గురువు బృహస్పతి బిడ్డా? చంద్రుని బిడ్డా? ఇవి మామూలే. యేడవకు. చెప్పగానే పరిష్కారమతుంది. గురువు బృహస్పతే, ''నా భార్యను నాకిప్పించండి'' అంటున్నాడు. మరొక స్త్రీని కట్టుకోరాదా గురూ?'' అని అంటే, '' ''అలా కాదు నాయనా! ముసలివాడేమీ చేయలేడని, మరొకడు రెండో స్త్రీని యెత్తుక పోతాడు. అలా సంగ్రహించలేరని నా తడాఖ చూపించాలి'' అన్నాడు. దేవ గురువు గెలిచాడుగా'' అని నవ్వింది కామేశ్వరి.

మరో కాకమ్మ భ్రమర, చంకన ఖాళీ బిందెతో నిలబడి కదుల్తూ, ముక్కు పుడకలోని రవ్వ మెరవగా అన్నది.

'' యేంగర్వమే కామేశ్వరీ, పురాణాలు చదివానని చెప్పుకుంటున్నావా? నేనూ చెప్పగలను. నారదుడు కృష్ణుని అడిగాడట. అన్నిటి కన్న

బలవత్తరమైనదేది?'' '' ఆకలి '' అన్నాడట కృష్ణుడు. '' ఆకలి లొంగదీస్తుంది'' ''ఋజువు చేయి కృష్ణా!'' ''రా'' అని కృష్ణుడు నారదుని చేయి పట్టుకుని ఓ సరస్సువద్దకు తీసికెళ్లాడట. ''దానిలో స్నానం చేసిరా'' అన్నాడు కృష్ణ. స్నానం చేసిన నారదుడు చాకలి యువతిగా అయి ఒడ్డెక్కాడు. కృష్ణుడు చాకలి యువకునిలాగా కనిపించాడు. పెద్దలు వారిద్దరికి పెళ్లి చేశారు. బావున్నారు కాని సంతానం లేదని చాకలి స్త్రీకి చింత పట్టుకున్నది. ఒక మునిని దర్శించి తన చింత చెప్పుకున్నది. '' ఆ చెట్టున దానిమ్మపండు బాగా పండి పగిలి వేలాడుతున్నది చూడు. దానిని కోసి తెచ్చి ఒక గింజ తిను చాలు'' అన్నాడట ముని. చాకలి అమ్మాయి పండుకోసి తెచ్చుకుని ఒక గింజ తిని తృప్తిపడక, నవ్వుతూ తుళ్లుతూ దానిమ్మ పండు తీయని గింజలన్నీ ఆరగించింది. కాలం గడుస్తుండగా గర్భం దాల్చింది. సంతోషించింది. కాని వరసన అరవైమంది పిల్లలు కలిగారు. సాటి చాకలివారు విరగబడి నవ్వారు. ఒక గడుగ్గాయి, ''మరి వూళ్లో అందరూ మొగుళ్లైతే అంతమంది కలగరా?'' అని హేలనగా నవ్వింది. భార్యాభర్తలు పిల్లల్ని పెంచారు. కాని గడ్డు రోజులెదుర్కొన్నారు. కాలం కలిసి రాలేదు. గుడ్డలు వుతికి బండ మీదుంచి స్నానం చేయటానికి వెళ్తే గుడ్డలెవరో యెత్తుకు పోయారు. గుడ్డలు వుతికి మూటలు కట్టి యిళ్లలో యిచ్చి వద్దామని భోజనం కానిచ్చి వచ్చి చూస్తే మూటలు లేవు. డబ్బు చెల్లించాల్సి వచ్చింది.

కాటకం వచ్చింది. పనీ లేదు. తిండీ లేదు. మొగుడు జబ్బుపడిపోయాడు. పిల్లలు ఆకలికి మాడి చచ్చారు. సొమ్మసిల్లి యేడ్చి ఆకలికి తాళలేక పడిపోయింది చాకలిది. ప్రాణం పోలేదు. మెల్లిగా లేచి కూచుని అన్ని వేపులా చూసింది. ఒక చెట్టు, దానికింద పెద్ద నీడ, దానికొాక అర ముగ్గిన పండు కంటబడ్డాయి. లేచి వెళ్లి పండు కోద్దామని పోతే అందలేదు. చచ్చిపడివున్న పిల్లల్ని తెచ్చి పేర్చి యెత్తుగా పెట్టింది. వారి మీద యెక్కి పండు అందుకుని కోయబోతుండగా ఒక బ్రాహ్మడు వచ్చాడు.

అమ్మా! చాలా ఆకలి మీదున్నావే? మైల గదూ. స్నానం చేసి వచ్చి తినాలి. శవాల మీద కూచునెలా తింటావు? దహనసంస్కారం చేయాలి. నేనన్నీ చేయిస్తా దిగిరా'' అన్నాడు. సరస్సు చూసి, ''అదుగో సరస్సు, స్నానం చేసిరా'' అన్నాడు.

''లోతేమో స్వామీ? మునిగిపోతానేమో'' అన్నది చాకలి.

''మునిగి పోకుండా నేను నీ చెయ్యి పట్టుకుని ఒడ్డున వుంటాను రా'' అని తీసుకెళ్లాడు.

చాకలిది బ్రాహ్మడి చేయి పట్టుకుని, ఆయన ఒడ్డున నిలబడగా, తాను నీళ్లలో మునిగి లేచింది. ఒడ్డెక్కింది నారదుడే. నిలబడి వున్న బ్రాహ్మడు కృష్ణుడు. చేయి నాజూకుగా వుండి గాజులున్నాయి నారదునికి'' బుజావైందా నారదా ఆకలి యెలా లొంగదీస్తుందో'' అన్నాడు కృష్ణుడు. 'పరమాత్మా! ఒప్పుకున్నానం. కానీ కడుపారా గన్న నా సంతానం వట్టిలో కలిసిపోవలసిందేనా?'' అన్నాడు విచారంగా.

''అదంతా నా మాయ నారదా. పిల్లలూ లేరు మొగుడూ లేడు. నీ విచారం పోగొడ్తాలే. నీ పిల్లలు ప్రభవ, విభవ, శుక్ల, అనే అరవై పేర్లతో కాలానికి కొలమానంగా అయి, ఒక్కొక్క సంవత్సరం చొప్పున వుంటూ, అరవై యేళ్లు ముగియగానే, మళ్లా ప్రభవ, విభవ అని తిరుగుతూ ఆచంద్రతారార్కం వుంటారు. పోదాం రా'' అని చేయి వదిలాడు. చూస్తే కృష్ణుడు లేడు.

''నీ పురాణగాధకి సందర్భ శుద్ధి లేదు భ్రమరా. అదేం పోలిక. కిన్నెరకి వూరంతా మొగులే అంటున్నావా? అదీ అరవైమందిని కంటుందంటావా?'' అని నవ్వింది కామేశ్వరి.

''యేమో కనగలదేమో! యెంత ధైర్యం లేకపోతే కూతుర్నీ కంటుందీ? దోరెలు పెడ్తున్నదన్నారు ప్రత్యర్థులు. అంటే యేమిటో నీకు తెలిస్తే చెప్పు''.

''రండే భామలారా!'' అని వృద్ధస్త్రీలు కూకలేశారు. మంచి నీళ్ల బిందెలు, నెత్తినా, బుజం మీదా, నడుమునా పెట్టుకుని వెళ్లిపోయారు.

3

రచ్చ బండ వద్ద యెన్నడూ అంత సందడి లేదు. తగాదా పరిష్కారం కన్న భోగట్టా సేకరించటానికే రావి చెట్టు కింద రచ్చబండ వద్ద పోగవుతారూరివారు. ఆ అశ్వర్థ వృక్షం యేనాటిదో, యెన్నేళ్లనించో యెన్ని కబుర్లో వింటున్నది. గాలి కబుర్లు వింటున్నది. కాకి గోలా వింటున్నది.

ఊరిపెద్ద, కులపెద్దలు, గ్రామ కరణం, గ్రామ మునసబు, విలేజ్ ఆఫీసర్, సర్పంచ్, హెడ్ కానిస్టేబుల్స్, యస్సై, కొత్త కానిస్టేబుల్స్ యిద్దరు, పొద్దుబోని వృద్ధులు ఒక విలేఖరి పోగయినారు.

''యేం చౌదరయ్యా! నిమ్మకి నీ రెత్తినట్టున్నావే? నిండుకుండ తొణకదని, అన్నీ తెలిసే గమ్మునుండి పోయావు. ఔనా? మన వూళ్లో పుట్టి పెరిగిన అబ్బాయి యీ మధ్య హీరో అయినాడు. యెక్కడున్నాడో వైనం తెలిసిందా? సూరమ్మా మనవూరి మనిషే. పెద్ద ఆశలు పెంచుకుంటే చుక్కెదురైంది. నీతో చెప్పిందిగా అదిచాలక వూరంతా యాగీ చేసింది. తీర్పిచ్చావూ? వూరడించి పంపావా? అంత తేలిగ్గా వదల్దే సూరమ్మ! మా బాగా జరిగింది. దురాశ దుఃఖం చేటు అని ఋజువైంది. రెండు చేతులా సంపాయించేవాడి పిలక తన చేతికి చిక్కుతున్నదనుకున్నది. దేవుడున్నాడు. వాడు నాటకమాడిస్తాడని మరిచింది''. చుట్ట పాగ పీల్చి గుప్పుగుప్పున వదిలాడు. శీతాకాలం వచ్చింది. పొద్దున చలివేస్తున్నది. గొంతుక్కూచున్నాడు కాపు గోపన్న. పోవాలి. పనివేళ పనివదిలి వచ్చాడు. కబురు చెవిన వేసుకుని వెళ్దామని వచ్చాడు. చేపాటి కర్ర. తలపాగా. ముతక షర్టు, ముతక ధోవతీ, కుడిచేతికి లావుపాటి వెండి కడియం, ముక్కుకి పోగు. ధృడంగా వుంటాడు.

చౌదరి రామయ్య విశాలమైన నుదుటి మీద పొడుగాటి యెర్రబొట్టు గుబురు మీసం. కోలముఖం. మనిషి బొద్దుగా వుంటాడు. హుందాగా కనబడేట్టు దుస్తులేసుకుంటాడు. సిల్కు షర్టు, పట్టంచుల వుత్తరీయం, జరీ అంచులున్న ఖద్దరు దోవతీ. లేత యెండలో విగ్రహం లాగా రచ్చబండ మీదున్నాడు. కుడిచేతికి

బంగారు కడియం, మెరుస్తున్నది. మెళ్లో తావళం. బంగారు గుండు, ముత్యం, పవడం రుద్రాక్ష వుంటాయి. దానికి కాలికి పూస స్ఫటికం. తావళం బంగారు తీగతో చుట్టబడి మెరుస్తున్నది.

"ఆ. ఆ. తెలిసింది గోపన్నా. గల్ఫ్ దేశంలో వున్నాడు. అదేదో కంట్రాక్టు వుద్యోగంట, శలవు మీద వచ్చి తనవారినీ, కొత్త బంధువులనూ చూసి పోతూ వుంటాడు. లోకులు పలుగాకులని కాకిగోల చేస్తూ వుంటారు. అదీ మామూలే. గోరంత విషయాన్ని కొండంత చేసి చెప్తారు. అంతా నిజమా? యెన్నటికీ కాదు. అసూయతో కుమిలేవాళ్లు, కథలల్లి వూరూ నాడూ యాకంచేస్తారు. విని వూరు కోవాలంతే" అన్నాడు.

రామసామి రైతు బిడ్డలేచి అన్నాడు. "పుట్టిన బుడ్డోళ్ళా తల్లీ యిసజ్జరమొచ్చి పోయినారని మా యాడ కూతురు కూస్తే, యీపు సదును చేశానుచౌదరయ్యా. ముత్తెమంటి మగకొడుకునీ, మానిక్కమంటి ఆడ కూతుర్నీ మన వూరి ఆడకూతురు కళ్ల జూస్తే, నీ కిదేం రోగమే కుళ్లుబోతా? నువ్వు కన్నావుగా నల్ల బంగారాన్నీ! అదీ సవ్యంగా కనలేక, నా చేత కర్సు చేయించి, ఆపరేషనని గొప్పలు సెప్తివి. రెండోపాలీ అంతే గదే మరిచావా యేమో. కనలేకపోతివి. సావనా? పట్నం తీసికెళ్లాలని మీ వాళ్లాదరపెట్టి చానా వదిలించారు నా చేత అని అంటే. సిగ్గు లేకుండా నవ్వింది నాయాడ కూతురు. అసలలాటి ఆపదలో కెందుకు నడిచారో మనూరమ్మాయీ అబ్బాయీ? అంతకు ముందెట్టి మచ్చాలేదే వారిద్దరికీ. పెద్దోళ్లకు తెలియకుండానే జరిగిందంటే నమ్మలేము. దేనికెదిరించినట్టు. కీలకమేదీ? కిటుకు తెలియలేదు చౌదరయ్యా. ఇదుగో పెద్ద గుమ్మడిపండు. మా దొడ్లో కాసింది. యెలకలు తినకుండా పిల్లిని కాపలా పెడ్తిరి. ఇంట్లో యిచ్చి వత్తునా" అలా అంటూ తన పక్కన నేల మీదున్న పెద్ద గుమ్మడిని తొడిమతో పట్టుకుని రెండుచేతులలా యెత్తి తెచ్చి యెదురుగా వుంచాడు రామసామి.

"శ్రమ తీసుకున్నావు రామసామీ. నీది పెద్ద మనసు. కాకి చేత కబురంపితే,

పాలేరుని నీ యింటికి పంపేవాడిని. వాడు మోసుకెళ్లి యింట్లో యిచ్చేవాడు. పాగ యెలా పుట్టిందనా అడిగావూ? మనవూరబ్బాయి మగబిడ్డ గదూ. మీసమొచ్చె. రొమ్ము బలిసె. పాత ఒక రోత కొత్తొకవింతా అని అభ్యుదయ భావాలు గలిగాయి మగబిడ్డకి. ఆచార ప్రకారం, ఆనవాయితీ ననుసరించి ఆస్తితో రావాలి కోడలని పెద్దలాశయం. అదేనాటి ఆచారమో పాత చింతకాయ పచ్చడి భావాలు మీవి. ఆస్తక్కర్లేదు. ఉద్యోగం చేయాలి కోడలు. అదీ నేడందరూ గ మనిస్తున్నది. కొత్త తరం ఆశయాలు కొత్తవి. నా వుద్దేశ ప్రకారమే పోతాను అని శపథం చేశాడు మగబిడ్డ. ''పోతే పో. నీ యిష్టమొచ్చినట్టేడు. యే గంగలో దూకితే మా కేమిటి. యెలా నీ కోరిక నెరవేరుతుందో, యెలా యీ యింట్లో అడుగుపెడుతుందో చూస్తాము. నీ ప్రైవేటు రంగం నీ సొంతం. కన్నవారిని గౌరవంగానే చూడాలి. పొరుగింటి పోయి రాయి వేతావా? ఆస్తి వున్నది. మరిచేవు. విడిబడేది లేదు. భాగాలు పంచం'' అని పంతాలాడారు పెద్దలు. పట్టింపులు బిగిసిపోయాయి. సందట్లో సడేమియా అని దాయాదులు రాజుతున్న పాగని వూది నిప్పు ఆరిపోకుండా చూస్తూ పుల్లలెగసనదోస్తూ విసరసాగారు. వాళ్ల కడుపుమంటా పాత కక్షలూ తీరాలిగా. కథలు నడిచేదిలాగే. కాలం దొర్లేది లాగే. కర్ణుడు లేని భారతమా అన్నారు. మాటలు చేరవేసే వారూ, కథలల్లే వారూ లేకపోతే కథ రక్తి గట్టదు. అదంతా ఆ అమ్మవారి చైతన్యమని చూస్తూ ఆనందించాలి'' అన్నాడు చదరయ్య. పొద్దు పైకెక్కింది.

## 4

మైదానంలో కుర్రకారు చేరారు. చెడుగుడు ఆడేవాళ్లూ, షటిల్ ఆడేవాళ్లూ, బాట్‌మింటన్ ఆడేవాళ్లూ, బాస్కెట్‌బాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, రింగ్ టెన్నిస్, కొక్కు, బొట్, గిరాట ఆడుతున్నారు. కొంతమంది సాధన చేస్తున్నారు. పోటీలలో పాల్గొంటారు. పరుగు పందెం, వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, హైజంప్, లాంగ్ జంప్, హర్డిల్స్, వ్యాయామం చేసేవారు వున్నారు. సరంజామా, పరికరాలూ వాళ్లే తెచ్చుకుంటారు.

''కిష్టప్పా! కాకిగోల అలాగే వుందిరా. సీరియల్ లాగా కథ నడుస్తున్నది. కొత్త మొహాలూ చూస్తున్నాం. కథ యెంత వరకూ వచ్చింది? నేను మా తాతగారితోనూ మామ్మతోనూ యాత్రలకు తోడు వెళ్లాను. ఖర్చులు వాళ్లవే. శలవలే గదా అని రమ్మన్నారు'' షటిల్ అడుతూ శేఖర్ అడిగాడు. ఇంటర్ ఫైనలియర్. ఈత పందేలకి వెళతాడు.

''మనవాడు సీరియల్లోని హీరోకి దూరపు బంధువు. మనవాడికి హీరోయిన్ వేపు మనుషుల సంగతి తెలియదేమో. అందానికి నేనూ సంగీతానికి మా బావగారూ అన్నదిట ఒంటె, బావగారంటే గాడిద. మనవాడు తన బోజమ్ ఫ్రెండు అంజయ్యను వెంటబెట్టుకుని, రాత్రి నిద్రవేళ వెళ్లి యీల వేశాడు. వాడి వుద్దేశం హీరోయిన్ మదర్ డబ్బు కక్కుర్తి మనిషనీ డబ్బుకాశించి హీరోకి అనుకూల పరిస్థితులేర్పరచి, రానిచ్చిందనీ, సీక్రెట్ ఫ్లెష్ ట్రేడ్ చేస్తున్నదనీ, డ్రగ్ రవాణాలాగన్నమాట, అవకాశం కల్పిస్తుందనీను అలా విన్నాడుట. నిజమెంత వరకు తెలిసికోకుండా వెళ్లాడు. తల్లి బయటికి వచ్చింది. పిండారబోసినట్లున్న వెన్నెట్లో కొత్త మొహాల్ని చూసింది. డాగ్ స్నారన్ చేసినట్టు చేసింది. డబ్బు చూపగానే రూమ్ చూపిస్తుందని భ్రమపడి మనవాడు నాగప్పు పాంట్ జోబీలోంచి పర్సులాగి ఆవిడ మొహాన విసిరాడు. ''యెటెళ్లాలి? బ్యూటీ సిస్టర్ని గూడానా? ఇద్దరికి ఒకే బోయ్‌ఫ్రెండ్ బాగలేదు. చాలా చేపలున్నాయే. నేనూ గోల్డ్‌ఫిష్‌నే'' అంటున్నాడట. మదర్ బార్క్ చేస్తూ తిట్ల పరంపర విసురుతుండగా, యిద్దరు మగధీరులు, అన్నా ప్లస్, మేనమామా, వచ్చి వీళ్లిద్దర్నీ పెడరెక్కలు విరిచి కట్టి, మక్కెలిరగదన్ని కాలవలోకి తోశారుట. అది చిన్న సైడు కాలవ. నిలవనీరూ, వాననీరూ వెల్లువలాగా ప్రవహిస్తున్నదట. నాగప్పు ప్లస్ అంజయ్య మొర్రోమని అరుస్తూ కొట్టుకుపోతుంటే చూసి, దారినపోయే దానయ్యలు, గుడ్‌సామరిటన్స్‌లాగా ఒడ్డుకి లాగి తాళ్లు విప్పి, లాగుడుబండీ, కట్టెలేసి తీసికెళ్లేది కంటబడితే, దాని మీదుంచి లాక్కెళ్లి హాస్పటల్లో పడేసి తమ దోవన తాము పోయారుట. అంజయ్యకి కాలూ చెయ్యి ఫ్రాక్చరయ్యాయి. ప్లాస్టర్ వేశారు.

మూడువారాలు మంచం దిగరాదు. నాగప్ప బ్రెయిన్‌కి గట్టి దెబ్బే తాకింది. అర్థం పర్థం లేకుండా వాగటం చూసి వాళ్లవాళ్లు యెరుకలపూడి తీసికెల్లి వైద్యం చేయించారట. బాగైందనే అంటున్నారిప్పుడు.

"యెరుకలపూడిలో యేం వైద్యం చేస్తారు?" "రమేష్ డంబెల్సుతో వ్యాయామం చేస్తూ అడిగాడు. అతను బాడీ బిల్డింగ్ పోటీకి తయారౌతున్నాడు.

"మాడు దువ్వి, నిమ్మరసం రుద్ది, పొద్దున్నే నలభై బిందెల చన్నీళ్లు ఆపకుండా నెత్తిన పోస్తారు. బిర్రబిగిసిన నరాలు మెత్తబడి బ్రెయిన్ నార్మల్‌గా పనిచేస్తుంది. అప్పటికి నార్మల్సీ రాకపోతే కొబ్బరితాళ్లతో వీపుమీద చమ్డాలూడదీస్తారు" అంటున్నాడు కథకుడు.

"అంటే అర్థంగాలేదు" శ్రోతలడిగారు.

"వీపు మీద తాట లేవగొడతారు".

"అర్థమైంది"

"అపుడు మెదడుకి వార్తలు సరిగా అందుతాయి. వివేకి అవుతాడు. యుక్తాయుక్తం తెలుస్తుందిట".

"పొగ తగ్గినా, నెగళ్లు మండుతూనే వున్నాయన్నారే? ఇంకా యేం కావాలిట? డబ్బందిస్తున్నాడుగా కథానాయకుడు. హీరోయిన్ వేపువారు మిసమిసలాడుతున్నారు. చక్కగా డ్రెస్ చేసుకుంటున్నారు. ఒక బ్రదరు, నాసామిరంగా అని, చచ్చు జాబ్ రిజైన్ చేసి కంప్యూటర్ ఎకాడమీలో చేరాడు. ఈ దెబ్బతో స్టేట్స్‌కి వెళ్లాలి. వెళ్తాను అంటున్నాడు"పళ్లు బైటబెటి సురేష్ గుంజీలు తీస్తూ అడిగాడు.

"పొగ యెక్కడ తగ్గిందీ? మళ్లీ రాజుకున్నది. లీఫ్‌లెట్స్ విసిరినట్టు వార్తలు గాలి వచ్చి చేరాయి. హీరోయిన్ ఎల్డర్ సిస్టర్ బ్రెయిన్ ఫీవర్ వచ్చి మూడు వారాల్లో హఠాన్మరణం పాలైంది. ధర్మాసుపత్రిలోనే తుదిశ్వాస విడిచింది. దాంతో మళ్లా నల్లని దట్టమైన పొగ వ్యాపించింది. వలవలా యేడుస్తూ హీరోయిన్ తల్లి "దగుల్బాజీ అల్లుని వేపు చాతబడి చేయటం వచ్చిన వాళ్లున్నారు. చెట్టంత

కూతురు, సాయపడేదాన్ని చేతబడి చేసి చంపారు. నేనేదో బావుకుంటున్నానని వూహించి నిక్షేపమంటి కూతుర్ని పెన్నిధి లాంటి బిడ్డను చంపించారు. వీళ్లు శిలలల్లే యిక్కడే వుంటారా? వీరికీ యిలాంటి యిక్కట్టు తెలిసిరాదా? ఈ కంటికీ రెప్పలు దూరంగావు. నే చూస్తా'' అని క్షిపణులు విసిరినట్టు, వియ్యమందని వారి మీదికి విసిరింది. ప్రతిపక్షులకూ నోరు పెద్దదే, రై రై మని గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లాగా, వీధినబడి, వూళ్లెంబడి తిరిగి,'' కూతుర్ని యెరబెట్టి, మా అబ్బాయిని మా నుంచి వేరు చేస్తే మా వుసురు తాకదా! చెట్టుకక్కట్టి కుదిపింది కర్మ. అప్పుడే అయిందీ?'' అని నాటుబాంబులు విసిరారు. హర్డిల్స్ దాటుతున్నట్టు గెంతారు. బాటన్ అందుకుని పరుగుపందెం పూర్తిచేస్తున్నట్టు ఒకరి నోరు మూతబడితే మరొకరందుకున్నారు. కరపత్రాలు పంచినట్టు యింటింటికీ వెళ్లి యెదుటివారి తప్పు లేకరువు పెట్టారు. వినే వారుంటే చెప్పేవారూ వుంటారుట''.

శివాజీ బస్కీలు, దణ్ణాలు సాధన చేస్తూనే అన్నాడు.

‘‘పందొమ్మిది వందల ముప్ఫై తొమ్మిదో సంవత్సరంలో నాందీ పలికిన రెండవ ప్రపంచ సంగ్రామం రాజీ రాజీ ఖండాంతరాలకు యూరేషియా అంతా వ్యాపించినట్లు, పుష్టీ నష్టీ వున్న బాంధవులు నింద్యగ్రామ్యంలో లేఖలు వ్రాసి మందుపాతరలలాగా పేలేట్టు పోస్టు డొక్కులు నింపారు. మరి వ్రాయనూ చదవనూ నేర్చిన దెందుకూ? సింప్లీ ఫర్ ఫన్ అన్నమాట. కోర్టు పన్ల మీద వూళ్లెంబడి తిరుగుతూ రైలు ఖర్చులు వృధాకాకుండా యెవరేమంటున్నారో వార్తలందించారు తాజావి. అచ్చం రేడియో వార్తలలాగే వుండేవి ‘‘బెర్లిన్ దిసీజ్ ది న్యూస్ రెడ్ బై రోషన్ కుమార్'' అని వినిపించేవి. వాడి మెడ వెనుక పిస్టల్ ఆనించి ఒకడున్నట్టు కార్టూన్ పడేది'' అని పేల్తూ నవ్వుతున్నాడు.

‘‘యెలాటి వార్తలో?'' అనడిగాడు వెయిట్ లిఫ్టర్.

‘‘అహహా!'' అని నవ్వుతూ వచ్చాడు చెడుగుడు ఆడుతున్న శివరావు.

‘‘భళారే! రంజుగా వుండేవి భయ్యా!'' అన్నాడు సుదర్శన్.

''తెలిస్తే చెప్పరాదూ? మేమూ బల్ పసందు చేస్తాం'' అన్నాడు రామూ.

''భళాభళీ! అలా సిగ్గూలజ్జా వదిలేసి కనేస్తే కనమను. మాలో కలవాలనీ మా నెత్తి నెక్కగలననీ కలగంటున్నదేమో? యెవరనుకుంటున్నదో మమ్మల్ని? వాడొట్టి అమాయకుడు. వెన్న బెడితే మింగలేడు, వేలు పెడితే కొరకలేడు. ఒట్టి అమాయకుడు. మోసమంటే అర్థమే తెలియదు. వెనుకటికి భాస్కరరాయలుకి లాకేత్త్వం దాక్కొమ్మురావుట. అంతగా గానివారు దిగజారి కోర్టుకెక్కితే, యాభై వేలు మూటగట్టి గిరగిరా తిప్పి మా అబ్బాయికి దిష్టితీసి వాళ్ల మొహాన విసిరేస్తాం. కాని యింట్లో అడుగుపెట్టనివ్వం. మా అబ్బాయి మమ్మల్ని వదలడు. మేమంటేనే ప్రాణం. లాయల్ టు హిజ్ ఓన్ పీపుల్'' అని కాకామని అరుస్తుంటే, విన్న కాకులు కాకామని అరుస్తూ యెగురుతూ వెళ్లి హీరోయిన్ తల్లి కాకికి చెవులు ఘడియలు బడేట్టు చెప్పినై. ''నిజం. ఒట్టు. అమ్మతోడు. యిలా అన్నారే అక్కయ్యా. ఈ యింటి మీది కాకి ఆ యింటి మీద వాలేందుకు ఒప్పుకోరుట. పచ్చుతాడూ కట్టనివ్వరుట. మూడు ముళ్లూ పడనివ్వరుట. నీ కాకి కూతురు గతి ఇంతే. వేర్పాటు చేసుకోవాలిట. వెలికి వెరవరాదుట. వేరే వూరు యెగిరిపోవాలిట''.

''యూ ఆర్ ది బిగ్గెస్ట్ డాంకీ ఐ హేవ్ సెట్ మై ఐస్ ఆన్'' అన్నాడు అంజి. గిరి ఆట ఆడుతున్నాడు. గుక్కపెట్టి, '' అంచ్ అమ్మంచి చెన్నన్న పట్నాంచి, పట్నాంచి పట్నాంచి'' అని అరుస్తూ తనను పట్టుకోమని గిరిలో తిరుగుతున్నాడు.

'' ఇది గాలికబురూ, నీలి వార్తా గాదురా అంజీ కాకి లాగానే అరుస్తూ కాకిలాగే వలయాలు తిరుగుతున్నావు'' అన్నాడు గోపాల్.

''మీ యింటిపేరే వేగుల. వేగుల వెంగాయమ్మ బిడ్డవి నువ్వు ఆ వెంగాయమ్మ వార్తాహరి తన బోయ్‌ఫ్రెండ్‌కి రసవత్తరంగా చెప్తుంటే గదిలో వున్న నీవు విన్నావు. మరిచిపోతానేమోనని యెగురుకుంటూ వచ్చి మైదానంలో అరుస్తున్నావు'' అని నవ్వు.

''చెన్నాపట్నం చెప్పుల జోడ్ నీకో జోడ్ నాకో జోడ్'' అని అరుస్తూ

గిరిలోకి వెళ్లిపోయాడు.

''బోయ్ ఫ్రెండుతో యెందుకూ?'' జానకీపతి అడిగాడు.

''లేటెస్టు రంకుపురాణాలూ, స్కాండల్సూ చెప్పి ఫ్రెండుని రంజింపచేసి రాల్చుకోస్తుంది. కాని ఆనాడు రాలలేదు. ఫ్రెండు చలించలేదు. కిక్కు యివ్వాలని సెక్సు ఆఫర్ చేసింది'' అన్నాడు అంజిగాడు.

''తగ్గ తాళం కొయ్యమేళమని కిక్కు రాలేదుట ఫ్రెండుకి''.

శ్రోత పకాపక నవ్వాడు ''నా మేనత్త నా పెళ్లిలో పాటపాడింది. పెండ్లి కూతుర నీకు యింతా పెంకె తన మది వ్రేలనే. పెండ్లి. కొమరుని పేరు చెప్పవు బింకమెందుకు చెప్పవే. అసలు విషయం వదిలేశారోయ్. అతను యెవరో యెందుకు చెప్పదు హీరోయిన్?''

''అయ్యో తెలివా? తెలివి తక్కువా ఆకలెక్కువా? పకోడీల పొట్లం తెచ్చుకున్నావా రహస్యంగా తినటానికీ?'' అని గేలి చేశాడు సోమూ.

''రిసరెక్షన్‌లో హీరోయిన్‌లాగా స్లేవ్ గాళ్ కాదే అని అడిగాను''.

''మనవాడు తాను అణగదొక్కబడిన తాడిత పీడిత బాధా సర్వభ్రష్టుల నుంచి వచ్చినా వారి నుండి వచ్చినా క్లాసికల్సు చదువుతానని చెప్పుకుంటున్నాడు ఫ్రెండ్స్. ''యెంకి మనమిద్దరమె యెవ్వరొద్దన్నాడు. గాలికైనా గాని కొగిలీ నన్నాడు. ఆనాటి నావోడు సెందురుడా! అలిగిరాడేమోనని చెప్పను సెందురూడా. సీతమ్మ జడ దెచ్చి చేతులో చెయ్యేసి, ఒట్టేయించుకుని వాగ్దానం తీసుకున్నాడట చెప్పనని. అందుకని ఫాదర్ పేరు చెప్పదుట''.

''చెప్పకపోతేయెలా? చెపితే యేం మునుగుతుందీ?'' అనడగ లేదూ నాయకి? చదివిందిగా? ముద్దరాలేమీ గాదు క్విజ్‌లాగా ప్రశ్నించవచ్చునే''.

''అలా చెపితే, నేను నీకు చేసే సపోర్టుకి అడ్డుపడతారు. నీ మదర్‌కి కోర్టు పక్షి అని నిక్‌నేమున్నది. ఆమె, ''మాస్కో నా తడాఖా'' అని మా యింట్లో భాగం రావాలని, మానభంగం జరిగిందని కోర్టుకీడుస్తుంది. ఆ కోర్టూ లాయర్లూ వాదోపవాదాలూ యింకా అపాయంలోకి నెట్టుతాయి. బాగా ఆలోచించుకో.

చెప్పకపోతేనే లాభం. నా దగ్గరున్నప్పుడల్లా యెక్కువే యిస్తా'' అన్నాడట. ''రాజశేఖరం నవ్వుతూ, ''అది అక్షరాలా నిజం మిత్రులారా. నాయకుడన్నట్టే నాకు జరిగింది. ఎక్స్‌పీరియన్సు మీదే చెపుతున్నా. అంతా కోల్పోయినా, లాయర్లు బాగుపడ్డారు'' అని అందరి వంకా చూశాడు.

స్కిప్పింగ్ నాలుగు రకాలు చేస్తూ శీనప్ప అడిగాడు. 'పురాణాలు చెప్పి కిక్కు యిచ్చినామె పడేసిన మనీతో యేం చేస్తుందిటా?''

''రంభవంటి ముద్దుల కూతురుకి మాచ్ ఫిక్స్ చేసిందట. పెళ్లి చేసేస్తుందిట ఆ డబ్బుతో''.

బాగా చీకటి పడింది. అంతా యింటి ముఖం పట్టారు.

సరంజామా బుజానేసుకుని పక్కపక్కనే నడిచారు. ఓహో కిన్నెరసాని'' అని పాడుతున్న శేఖరాన్ని వీపు చరిచి సోమూ అన్నాడు ''కవి సామ్రాట్ అల్లిన కిన్నెరసాని పాటలూ, కోకిలమ్మ పెళ్లీ వచ్చుని తెలుసులే. కాని సోదరా మన కిన్నెరసాని గాదు గంధర్వుని ప్రియురాలు ఇంకా చెప్పాలంటే కథానాయిక''.

5

రైలు పోతున్నది. చప్పుడు లయబద్ధంగా వున్నది. రైలు పట్టాలకి రెండువేపులా కుగ్రామాలూ, పచ్చని చేలూ, టెల్లిగ్రాపు స్తంభాలూ, వాటి తీగలూ, వెళ్లచ్చు అని చూపే గ్రీన్ సిగ్నల్సూ, రైలు చెక్క వంగి కనపడుతుంది. పంట కాలవా, నీటి పడియలూ, కలువ పూలూ కనబడతాయి. దూరాన రైతుబిడ్డలు ఆడుకుంటూ కనబడతారు. గడ్డిమోపు నెత్తిన పెట్టుకుని వయ్యారంగా నడుం కదిలిస్తూ వెళ్లే ఆడపిల్లలు చేతిలో కొడవలితో కనబడతారు.

సేతు రామయ్య రైలు పెట్టెలో కిటికీ దగ్గరగా వున్న సీటు మీద కాళ్లు జాచుకుని కూచుని వున్నాడు. రైలుపెట్టెకు తల ఆనించి తెలుగు వార్తాపత్రిక దినపత్రిక చదువుతున్నాడు. వెల్తురు బాగానే పడుతున్నది పత్రిక మీద.

రఘురామయ్య అడిగాడు. 'సేతూ! కాకి గోల ఆగిపోయిందా? కథానాయకుడింకాస్త గ్రంథం నడిపిస్తే యింకా సందడి వుండేది. ఊళ్లో యెంత

సందడి పుట్టించాడూ? అంతా సవ్యంగా ధర్మమార్గాన పోతూ, నీతి నియమాలూ, దయా దాక్షిణాలూ పాటిస్తే సత్యయుగంలాగా మందకొడిగా వుండి, యెంతటా తెల్లవారదూ, యెంతటా పొద్దూకదేమి సేతు అనిపించేది. నిలవనీరు లాగా చైతన్యం లేక మొహం మొత్తేది''.

దశరథరామయ్య వారపత్రిక తన మొహానికడ్డం తీసి, కాల్చేసిన సిగరెట్టు కిటికీలోంచి విసిరేశాడు. ''ఇంకా ఆగలేదు బాబాయ్. రెండు కాకులూ, నాలుగు కాకులూ చెట్టు కొమ్మల మీదా, గుడి మీదా, ధ్వజస్తంభం మీదా కూచుని పులుకూ పులుకూ చూస్తూ కాకా మంటూనే వున్నాయి''.

సీతారామయ్య పొడుం పట్టుపట్టి వూపిరాడాక అన్నాడు. ''తెలిసే అడుగుతున్నాడు బాబాయి తెలియకనా?''

''నీకు తెలిసింది చెప్పరాదూ'' పై బెర్తు మీద పడుకుని వక్కపొడి నవులుతున్న జానకిరామయ్య అన్నాడు. నిద్రరాక అవస్థపడుతూ అన్నీ వింటూనే వున్నాడు.

''నిజమెంతో నాకూ తెలియదు. నేను ఒట్టిగోలే విన్నాను''.

''విన్నదే చెప్పు''

''పానకంలో పుడకలాగా నాయకి పెత్తండ్రి కూతురు కమల చెల్లి వరసయిన దాన్ని దుమ్మెత్తి పోసింది. ఇల్లు వదిలి పారిపోయేట్టు చేసింది అగ్నిపర్వతం పగిలినట్టు లావా ప్రవహించినట్టు దూషించింది చెల్లిని. నోరు మూతపడలేదు''

''లావా యెలా నాయకి వేపు ప్రవహించిందీ?''

''కథానాయకుడూ తానూ లౌ ఎట్ ఫస్ట్ సైట్ అని చూడగానే లౌ చేసుకుని గాంధర్వం వెలిగించారుట. చుప్పనాతి చెల్లెలు నాయకి గంధర్వునికి మందుపెట్టి మతి విరిచి, తనవేపు తిప్పుకున్నదట. ''ఉరిబెట్టుకోరాదటే చెల్లెలా? గంధర్వుడు నావాడు. నా చేతులో పోయాల్సిన డబ్బు నీ చేతిలో పోస్తున్నాడు. నాక్కూడా అన్నంలో మందు కలిపి పెట్టావా? మతి విరిచేశావా? మతిలేనిదానా అని

తిడుతున్నారు నన్ను వూరివాళ్లు. మాణిక్యమంటి నన్ను వదిలి, మసి బొగ్గులాగా వున్న నీ కెట్లావశమైనాడే? నీ చదువు చట్టుగానూ. ఆ మాత్రం బోడి చదువు నేనూ చదివాను. ద్రోహీ! చీడపురుగు. ఇంటికి జెష్ఠ. పొరుగింటికి శ్రీమహాలక్ష్మి. కాకి ముక్కుకి దొండపండని. నీ కెలా తగివున్నాడే నన్ను గాంధర్వం వెలిగించిన గంధర్వుడూ. గంతకు తగిన బొంతను చూసుకోలేవుటే?. వశీకరణమంత్రం వుపదేశించే కాషాయాంబరధారిణి. నీ గదిలో గుడుగుడుమని గూడుపుఠాణీ చేసేవారు కాదా? యేమిటా కుంభకోణం?''

''ఆ హిస్టీరికల్ ధోరణికి నవ్వుతున్నా కిన్నెర కళ్ల వెంట జలజలా నీళ్లు రాలాయి. చెంపల మీదినించి జారి పమిట మీద పడ్డాయి. తుడుచుకోనుగూడా తుడుచుకోదు కిన్నెర''. జానకిరామయ్య జంతికలు తింటూ అన్నాడు. ''కథానాయకుడు గడుసుపిండమే. అందర్నీ తలోరకంగా యేడిపిస్తూ, పప్పెట్ షో లాగా నవ్వుతూ దారాలు లాగుతూ తాను పైన కనబడకుండా వుంటాడు''.

''నీకెలా తెలుసు?'' ఆంజనేయులడిగాడు.

''నాయకుని నకిలీ ఇన్‌లా జిగురులాగా పట్టుకుని నా ఫ్రెండు మోడరన్ బిజినెస్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేరూ వంటివి పెట్టుకున్నాడు. నన్ను సేల్స్‌మాన్‌గా ఎంగేజ్ చేశాడు. ఇకనమిక్ అడ్వయిజర్ని అన్నాడు. కాని యియ్యాల్సిన అధికారమూ యివ్వటం లేదు. చూపాల్సిన గౌరవమూ చూపటం లేదు. నౌకర్ని వాడుకుంటున్నట్టు అన్ని పన్లూ చెపుతున్నాడు. అనుమానిస్తున్నాడు. లెక్కలు చూపాలిట'' అని సోది చెప్తూ రొద పెట్టాడు. చల్లగా అసలు విషయం బైటబెట్టాడు నకలు బామ్మర్ది ''నువ్వు అయిదు లక్షలకు హామీ వుండు. ఆ బిజినెస్ నాకు స్వాధీనం చేస్తాడు నా ఫ్రెండ్. నేను స్వయంగా నడుపుతాను. నేనే పెట్టాలంటే పన్నెండు లక్షలు కావాలి. సెంటు భూమిలేనివాడికెవరిస్తారు? సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంటు స్కీమ్ కింద తెద్దామని చూశాను గానీ గ్రీజ్ పూయాలి కింది వారికి. అది మాత్రం యేదీ?'' కథానాయకునికి భస్మాసురుని రికగ్నైజ్ చేసే ప్రతిభ అనుభవం మీద వచ్చింది. నవ్వుతూ మొండి చేయి చూపించాడు.

''నా దగ్గర డబ్బు మూలుగుతున్నదని అందరూ అనుకుంటారు. నిజం తెలుసుకుందామని వుండదు. నేను స్టాక్ మార్కెట్లో, స్టాక్ ఎక్స్చేంజ్ పద్ధతి మీద రెట్టింపు వస్తుందనీ, దేశంగాని దేశంలో వుద్యోగం చేసే అవసరముండదు. రిజైన్ చేసి వచ్చేద్దామని అనుకుంటుండగా మెహతాస్కామ్‌లో అంతా కోల్పోయాను. స్టాక్ మార్కెట్ స్టాక్ ఎక్స్చేంజ్ బిజినెస్‌లోని లొసుగులు తెలిసిన పై అధికారులు కోట్లల్లో స్వాహా చేసి దివాల తీసింది మార్కెట్ అని ప్రెస్ విలేఖరుల యెదుట చెప్పారు'' అన్నాడుట గడుగ్గాయి.

''అంతా అరెస్టయినారనీ కేసు జరుగుతున్నదనీ దినపత్రికలో చదివానే'' అన్నాడు నకిలీ.

''నిజమే కావచ్చు. కేసు పెడితే యేమైనట్టు? యెవరి డబ్బు వారి కందాలి. యేదీ? దీంతోనే గుండె జారిపోతే నా మేనమామ జెంబుకేశం కార్ల వ్యాపారం నడుపుతున్నవాడు, బయానా తీసుకుని కారు అప్పగించలేదని అరెస్టయితే నా చెల్లెలు నా కాళ్ళు పట్టుకుని వదిలించమన్నది. పిల్లల్నెవరు సాకుతారన్నది. ఒక్కతే చెల్లెలు. చూడలేక వినలేక బావను వదిలించాను'' అన్నాడు తాపీగా.

'' మొదటిదే. నీ యెరికన డీలర్ఫున్నారాయేం?'' అని నిల్చోలేనట్టు చతికిలబడ్డాడు కథానాయకుడు.

''అయిదు లక్షలదాకా వెళ్లిందే వెల, అంతా చెల్లించావా?''

''చెప్పేదదే బ్రదరిన్లా. యెలా కండచీమలు నన్ను పీక్కు తింటున్నాయో తెలియజెప్పా'' అని చీదాడు నాయకుడు. నకిలీ బావమ్మర్ది యెగాదిగా చూశాడు కథానాయకుడిని.

''వీడి పెళ్లాం పిల్లల్ని ముద్దు చేస్తూ కనిబెట్టి చూస్తుంటే దగాకోరుకు విశ్వాసం లేదు. నా చెల్లెలికి టోకరా వేసినట్టే నాకూ వేయగలననుకుంటున్నాడు. శాస్త్రాన్ని గౌరవించటానికి గుండెలు లేవు. భాగం కోసం పేచీపెడతారని భయం. యెత్తుకు పై యెత్తు వేయటంలో వున్నాయి తెలివితేటలు. డబ్బు యివ్వబుద్ధి గావటం లేదు. వీడి అంతునే చూడలేనా? మా అమ్మకి పురెక్కించానంటే డబ్బు

అక్కడ పెట్టి పెళ్లాం పిల్లల్ని తీసికెళ్లు అంటుంది అభినవ కైకమ్మ. యెన్ని మాటలు పడ్డాము. యెన్ని తిట్లు తిన్నాము? కైకదాసి మంధర, రాజ్యం అడగమనీ భరతుని రాజుని చేయమని వరాల ద్వారా పట్టుబట్టమని కైకకు బాగా పురెక్కించింది. వెళ్లిపోతూ నవ్వుకున్నదిట.

''నేనే నయం పుట్టరేప్పెట్టి, పురెక్కించి వూరుకున్నాను. యీ కైక మగడు దశరధుని ప్రాణం తీస్తుంది. మంకుపట్టు''.

అలాగే వీడికి తల తిరిగి నోట్లోకి ముద్ద వచ్చేట్టు చేస్తుంది మా అమ్మ. ఆమె నిక్‌నేమ్ వీడు వినలేదేమో. ''డబ్బు మనిషి'' అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు''.

''అలా చేయగలిగాడా? డబ్బు మనిషి నాయకుని ప్రాణాలు తీసిందా? గ్రిప్పింగ్ స్టైల్లో చెప్పావు సుబ్బరామా. మిస్టరీ విడదీయి'' అడిగాడు యాజులు.

భగవద్గీత చదువుతూ పురాణశ్రవణం చేస్తున్న దీక్షితులన్నాడు ''నీదంతా చోద్యం యాజులూ! అంత అమాయకత్త్వం నటిస్తే నమ్ముతారా? నీవు గడుసుపిండానివే. తకరారు లేదు. వేదాంతివి గదూ. దుష్టశిక్షణా, శిష్టరక్షణా జరుగుతుందని చెప్పేవాడివి. దుర్యోధనునికి పెద్ద శిక్షే పడింది. తొడలు విరిగి లేవలేక వైశంపాయన హ్రదం ఒడ్డున దిక్కులేక పడివున్నాడు గురుపుత్రుడొచ్చేదాకా. కృష్ణుడు రాక్షసత్త్వం హర్షిస్తాడా? గెలవనిస్తాడా? హిట్లరు ఓటమికి, మిత్రసేనలు గెలవటానికీ పరమాత్మే సాయపడ్డాడు. సినిమాల్లో గూడా విలన్‌కి శిక్షపడటం నాయకీ నాయకులకు శుభం కలగటం చూస్తూనే వున్నాము''.

''పోనీ నువ్వు ఇంటరెస్టింగా చెప్పు. నాయకీ నాయకులకు లాభించడం శుభం. అనే సీనూ చూడాలని వున్నది. స్టోరీ టెల్లరని పేరుబడ్డావు'' యాజులు పక్కపరుస్తూ నడుం వాలుస్తూ అన్నాడు.

''వానవెలిసినా చూరునీళ్లు పడుతున్నట్టు, గూడులేక తడిసిన కాకులు చెట్లకొమ్మల మీద కూచుని చూస్తున్నట్టు వూరివారు చూస్తున్నారు. అదెల్ల మనమేలుకే అన్నట్టు కిన్నెర సోదరి కిన్నెరని గొంతు పిసికి చంపబోయింది. ఆమె

హిస్టీరియా ముదిరింది. నలుగురమ్మలక్కలు పోగై తల్లి అనుమాయమ్మను దుయ్యబట్టారు'' చూసి గూడా మిన్నకుంటావేం అనుమాయమ్మా. యెరుకలపూడి తీసికెళ్లు పైత్యం యెక్కువైంది. పిత్తకోశం చెడింది. గాలి సోకింది. లేదా, మేం సాయం చేస్తాం రా. మానసిక ఆరోగ్య కేంద్రంలో చేరుద్దాము పైత్యకారిని. బిడ్డల తల్లిని చంపేట్టున్నది. కచ్చేమో. బిడ్డల తల్లిని చంపి, పిల్లల్ని తల్లిలేని వాళ్లని చేయాలని చూస్తున్నది. నీవు దగ్గరుండవైపాయె. కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతావైపాయె. తిరిగే కాలూ తిట్టే నోరు వూరికే వుండలేవు'' అనుమాయమ్మ ఆ రెండూ యెందుకు చేయుదో వివరించింది. ''యెరకలపూడిలో నయం కాకపోగా చచ్చిపోతున్నారు. మా అమ్మాయి మానసిక ఆరోగ్య కేంద్రంలో వున్నదని పాక్కంగానే దాని అత్తవారు ఆస్తి లాక్కుని యింత భృతి యిస్తారు'' అని అరుస్తూ తల విసిరి, పళ్లు పటపటలాడించి కనులెర్రజేసి చిన్న సైజు నరసింహావతారమెత్తింది అనుమాయమ్మ. స్వంత తల్లి గొప్ప వ్యవహర్త. మంచి రోజు చూసి కిన్నెరనీ ఆమె బిడ్డల్నీ వేరే వూరు తీసికెళ్లి మట్టసమైన చిన్న యిల్లు చూసి కిన్నెర డబ్బుతోనే కావాల్సిన వంటగిన్నెలూ, మంచం పరుపూ కొనిబెట్టి యింటికి మూడు నెలల అద్దె బయానా యిప్పించి ''నేను వస్తూ పోతూ వుంటా. వాళ్లు ఆస్తి పరులుగదూ వాళ్లవల్ల లాభమున్నది. పిల్లను పారేసుకుంటామా పైత్తెకారి అని అనుమాయమ్మ కిన్నెరను కావిలించుకుని యేడ్చింది. కొన్ని భరించాలి'' అని నచ్చచెప్పి వచ్చింది. శ్రీ కృష్ణపరమాత్మ కథానాయకునికి మంచి అవకాశం అందించాడు. లాభసాటి అవకాశం వాడుకున్నాడు హీరో. శలవు మీద వచ్చినప్పుడు గప్‌చుప్‌గా ప్రేయసిని దాని కూనల్ని తానున్న దేశం తీసికెళ్లాడు''.

''ప్రియా! ప్రేయసీ! నాకు క్వార్టర్సూ, మంచినీళ్లూ లైట్లు వుచితముగా యిస్తున్నారు. ఇది మరో కాంట్రాక్ట్ జాబ్. దూరాన ఒంటరిగా అఘోరించ లేకుండా వున్నాను. రానూ పోనూ చాలా వదలటమే గాక, అన్‌మారీడ్ అని వ్రాశా గదూ, ఆ దేశీయువతలు పెళ్లాడుదాం రా అని పీకపట్టుకుంటున్నారు.

అదంటూ ఒకటి జరగంగానే వాళ్లకి చాలా హక్కులొస్తాయి. ముందుగా నా ఆదాయం మీద అధికారమొస్తుంది. నువే దేవతవి. ఇచ్చిందేదో పుచ్చుకుని నన్ను ప్రేమిస్తావు'' అన్నాడు కిన్నెరతో.

డబ్బు మనిషని పేరు బడిన తల్లి వచ్చింది మూడునెలలకి. ఇంటి యజమానురాలు అంతా చెప్పింది.

''అల్లుడు మంచివాడే. నెలే వున్నది. తక్కిన రెండునెలల బాడుగ వాపస్ చేయుమనలేదు. అన్నీ దానం చేయించాడు. నాక్కూడా మంచం దానం చేయించాడు'' అన్నది.

తల్లి నాలుక వెళ్లబెట్టింది. కుక్కశ గుంద్రాయితో తీరినట్లయిందర్రా. లా ప్రకారం వరిది గాని బావమ్మర్ది అన్నంత పనీ చేశాడు. తల్లికి బాగా పురెక్కించాడు''.

''హీరోగాడు అంతా ప్లాన్‌వేసి చేశాడమ్మా. వాడికీ పేరంట్సుకీ మాట పట్టింపులొచ్చాయి. పెళ్లి చేసుకోను అని వాళ్లిద్దరి పాదాలు తాకి ప్రమాణం చేశాడట. మనకేమీ తెలియవు. కాని ఒక పిల్ల చాలా అవసరంగా కావాల్సి వచ్చింది. యెవరికి యెరపెట్టినా 'పెళ్లి, పెళ్లి!'' అన్నవారే గాని అంది వచ్చినవారే లేరు. నీ కూతురూ నువ్వూ యేదో ఆశకు లొంగారు. వాడిని బ్లాక్‌మెయిల్ చేసి కాళ్ల బేరానికి తేవాలి నువ్వు. నీ పస తెలిసిరావాలి వాడికి'' అలా నిషా యెక్కించాడు గానీ బెడిసికొట్టింది నకిలీ యిన్‌లాకి.

ఫియట్ కార్ల వ్యాపారి వద్ద పనికి కుదిరాడు, సీనియర్ మెకానిక్‌గా. నమ్మకస్తుడేననే అభిప్రాయం కలిగించాడు. కారు అప్పగించి వస్తానని తోలుకెళ్లి మాయమైనాడు. పోలీసులకి రిపోర్టు వెళ్లింది. కృష్ణదేవరాయల సామంతుడొకడు శత్రువు నోడించి, పాగరణచి కప్పం గట్టించే సంధి చేసుకు వస్తానని వెళ్లి గెలిచాడు గానీ, ఆ రాష్ట్రానికి తానురాజునని స్వతంత్రం ప్రకటించాడు. కృష్ణదేవరాయలు ఆ ద్రోహి కొడుకునే ద్రోహిని పట్టి తెమ్మని పంపాడుట. కొడుకు తండ్రిని పట్టి తెచ్చి రాయలు యెదుట నించోబెట్టాడుట. అలాగా కారు చేత చిక్కగానే మరో

రాష్ట్రంలో అమ్మి డబ్బు చేయాలని చూస్తుండగా పట్టుబట్టాడు బామ్మర్ది. అరెస్టయినవాడిని వ్యవహర్త తల్లి విడిపించేప్పటికి ఆమె కన్నులొట్టబోయింది. అయినా విడిపించ గలిగింది అదీ గొప్ప.

''దుస్సహవాసం చేసి, నకిలీ పీపుల్స్ వార్ గ్రూప్‌తో కలిసి వారి ప్రోద్బలంతో అలా చేశాడు నా పుత్రరత్నం. స్వతహాగా మంచివాడు. అమాయకుడు. మీ కారు మీ కందిందిగా. యెక్కడా ఒక్కడాగుకూడా పడలేదు. దయతలచండి'' అని వలవలా యేడిచి దణ్ణాలు పెట్టి, కిందబడి పొర్లింతలు పెట్టి లేచి, కలకలా నవ్వుతూ వెళ్లి, తాను పెట్టుకున్న కొత్త ఆవకాయ వూరగాయ కుండెడు మోసుకొచ్చి యెదురుగా పెట్టి, గూడెగరేసి, ముక్కు నలుపుకుని, రుచి చూడమని ఇడ్లీలు పళ్లేలలో వుంచి ఆవగుండ వేసి కమ్మని నెయ్యి వేసి తినిపించింది అందరి చేతా. యెర్రగా పుల్లగా వున్న వూరగాయ తిని మెచ్చి పుత్రరత్నాన్ని కటకటాల వెనక్కి పంపక తల్లి వెంటే పంపారు''.

'పుత్రరత్నానికి టెక్నాలజీ ముదిరిందని తెలియదేమో తప్పించుక పోయిన ఛాల్స్ శోభరాజ్‌నే పట్టగలిగారు రక్షణశాఖ వారు. డబ్బులేని వాడిని పట్టటమెంత సేపు!''

''ప్రతి యేడూ పెట్టిస్తా ఆర్డరివ్వండి'' అని వూరించి కళ్లు తుడుచుకుని కొడుకును వెంటబెట్టుకెళ్లింది తల్లి.

'స్వంత కాకుల రవటం ఆపేసినై?''.

''లేదు లేదు. రామసామీ! ఓపికున్నప్పుడల్లా కాకా మంటూనే వున్నాయి'' వదిలేస్తాడనుకున్నాం సుమా వదినా. అంతెత్తు పిల్లని బంగారం దిగేసి, వైభవంగా పెళ్లి జరిపిస్తాం. మా అమ్మాయి సెంట్రల్ బాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నది. పర్మినెంటయింది జాబ్. మేమన్నీ పట్టించుకోం. మీతో వియ్యమందటమే మహాద్భాగ్యంగా తలుస్తాం. అంత అందగాడినీ గొప్ప అల్లుని యింటికి తెచ్చుకోటమే గొప్పగా భావిస్తున్నాం'' అని పదేపదే మా చుట్టూ తిరిగిపోతుంటే, ''అవుననుకోండి వదిన గారూ! కాని మా అబ్బాయి అందడైపాయె. నిలకడగా

యింటిపట్టునుంటే మెడలు వంచైనా చేతువము. మీ కంతగా మాతో వియ్యమందాలని వుంటే, కొంచెం ఓపిక పట్టండి, అన్నగారూ! ఆ అమ్మాయి నిలకడ మనిషిగాదు. దాని సయానా మేనమామ పెళ్లాం బయోడేటా, సయానా పింతల్లి బయాగ్రఫీ మీరు వినే వున్నారు. జగద్విదితమే. రంకూ, బొంకూ, వడ్డీ వ్యాపారాలకి వాసకెక్కారు వారంతా. అంతటితో అయిపోదు. తండాలు తండాలుగా వచ్చి మేస్తూ వుంటారు దానివేపు వాళ్లు. అగ్రహారీకుల అలవాట్ల మీకు తెలియవా వదిన గారూ! ఆ కాపరం మూణ్ణాళ్ల ముచ్చటే కాకపోతే మేం మతం మారుతాం. మా వాడికి తలపట్టి పోయి, దాన్నీ దాని సంతానాన్నీ ఆ దేశంలోనే వదిలేసి యింతో అంతో ముట్టజెప్పి వచ్చేస్తాడు. భరోసా కలిగి వుండండి. మనం ఒకళ్ల కొకళ్లం వియ్యమందటానికి తగివున్నాము. మరొక వియ్యం నిలువెత్తు ధనం పోసినా చేసుకోము'' అని నమ్మబలికి వదిలించుకున్నారా మర్యాదస్తులు.

యాజులు నవ్వుతూ అన్నాడు '' ఆ వూరి కాకుల్లో ఓ కాకి యీ మధ్యే మర్డర్ కేసులో నమోదైతే, పాకీస్తాన్ పంపేశారు వాళ్ల వాళ్లు. పులి బుర్రలు వదిలినై''.

''మరో కాకి దొంగనోట్లు సర్క్యులేట్ చేస్తూ పట్టుబడ్డాడు''.

''మరో కాకి ఆడపిల్లను దాచి రాన్సమ్ లాగి యిచ్చేశాడు''

'పెళ్లాడలేదూ? డబ్బు కోసం యెత్తుకొచ్చాడా?''

''అహ. దాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీలో స్థిరపరచి లక్షలార్జించాలని తెచ్చాడు. కాని కలిసి రాలేదు. చాలామంది ఆడపిల్లలు సర్ఫేస్ అవుతున్నారీ కాలంలో. మదుపూ పెట్టాలి. రికమండేషనూ తేవాలని తెలియదు. పిల్లకేమో గ్రామ్యభాష తప్పితే మరొకటి రాదు. అందం పనిచేయలేదు''.

అలా రైల్లో గూడా కాకిగోల వినపడుతున్నది. రైలు ఆ గోల నణచిపెడుతూ చప్పుడు చేస్తూ పరుగెడుతున్నది.